క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

● జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, విద్యాశాఖాధికారులు

కర్నూలు కల్చరల్: కాలుష్య ప్రభావం నుంచి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జిల్లా కలెక్టర్‌డాక్టర్ జి.సృజన అన్నారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో 'పర్యావరణ రక్షణ – ప్లాస్టిక్ నిర్మూలన' పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, విద్యాశాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ గ్లాసెస్‌కి బదులుగా స్టీల్ బాటిల్స్, స్టీల్ గ్లాసెస్ వినియోగించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నేటి పారిశ్రామికీకరణ యుగంలో పర్యావరణం గురించి ఆలోచించడం చాలా ముఖ్యమన్నారు. పెరుగుతున్న కాలుష్య సమస్యలను అధిగమించడానికి ఏకైక మార్గం పచ్చదనాన్ని పెంచడమే అన్నారు. కార్యక్రమంలో సీపీఓ అప్పలకొండ, జిల్లా విద్యా శాఖ అధికారి రంగారెడ్డి, సర్వశిక్ష అభియాన్ పీఓ వేణుగోపాల్, జిల్లా సైన్స్ ఆఫీసర్ రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి మద్దిలేటయ్య సన్నిధిలో ప్రత్యేక కార్యక్రమాలు



జెడ్పీ చైర్మన్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఈఓ, తదితరులు

కర్నూలు(అర్బన్): నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆయన శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డిని కలిసి ఆహ్వానపత్రిక అందించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ రూ.3.90 కోట్లతో నూతన విమాన గోపురం, ధ్వజ స్తంభం, ద్వారపాలకు పరివార ప్రతిష్ట తదితర పునః నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఈ పనులను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించనున్నారని చెప్పారు. నాలుగు రోజుల పాటు దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

క్రీడాకారులను వేధించడం తగదు



ధర్నా చేస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

కర్నూలు కల్చరల్: దేశానికి పతకాలు తీసుకొచ్చిన క్రీడాకారులను వేధించడం తగదని ఎస్‌డీపీఐ నగర అధ్యక్షుడు అశ్వాక్ హుసేన్ అన్నారు. డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని నిరసన తెలుపుతున్న రెజ్లింగ్ క్రీడాకారులకు మద్దతుగా ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు రమ్య కృష్ణారెడ్డి, పీఎస్ఏడబ్ల్యూ నాయకులు రత్నం ఏసేపు, అల్లాబక్ష్ అబ్దుల్లా, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు నాగభూషణం

కర్నూలు (రూరల్):మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం డిమాండ్ చేశారు.ఈ అంశంపై హిందుపురంలో ప్రారంభించిన బస్సు యాత్ర శుక్రవారం కర్నూలు నగరానికి చేరుకుంది. నగరంలోని ఏడో డివిజన్‌లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజి బాబు అధ్వర్యంలో సభ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు ముత్యాల రాజు,నాగరాజు,లక్ష్మీ నారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, అబ్దుల్, సాయిబాబా, నరసింహులు, విజయ్, రాముడు, ఎస్తేరమ్మ ఓబులేసు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం

కర్నూలు(టౌన్) : నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద నిషేధిత ప్లాస్టిక్‌తో వెళ్తున్న వాహనాన్ని నగర పాలక ఆరోగ్య శాఖ అధికారులు శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. అందులో 10 వేలకు పైగా ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు ఉండగా వాటిని స్వాధీనం చేసుకుని రూ.3 వేలు జరిమానా విధించినట్లు నగరపాలక ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి తెలిపారు.

ఇక్కడ అన్నీ అధిక ధరలే!



● బస్టాండ్లలో అటకెక్కిన ఎంఆర్‌పీ అమలు
● ప్రయాణికులను దోచుకుంటున్న దుకాణాదారులు
● బయట కనిపించని ధరల పట్టిక
● చూసీ చూడనట్లు వెళ్తున్న ఆర్టీసీ అధికారులు
● నిద్రమత్తులో తూనికలు, కొలత శాఖ





కర్నూలు బస్టాండ్‌లోని ఓ దుకాణంలో తినుబండారాలు కొనుగోలు చేస్తున్న ప్రయాణికులు, కూల్‌డ్రింక్ తీసుకుంటున్న ప్రయాణికుడు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికుల సౌలభ్యం కోసం రోడ్డు రవాణా సంస్థ బస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు ఎంఆర్పీకి మించి వస్తువులు విక్రయిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయాణికుల జేబుకు చిల్లు పడుతోంది.

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 12 డిపోల్లో 930 బస్సులున్నాయి. రోజుకు 370 రూట్లలో 4లక్షల కిలో మీటర్లు తిరిగి 3.80 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ప్రజల సౌకర్యార్థం బస్‌స్టేషన్లలో అంగళ్లను ఏర్పాటు చేసి టెండర్ల ద్వారా ప్రైవేటు వ్యక్తులకు అద్దె ప్రతిపాదికన ఇస్తారు. 12 డిపోల పరిధిలో 348 షాపులుండగా కేవలం కర్నూలు బస్‌స్టేషన్‌లో 70, ఆరు బయట మరో 120 షాపులున్నాయి. ఐదేళ్లకోసారి తిరిగి టెండర్లు పిలుస్తారు. ఒక సారి టెండరు ఖరారు అయితే మూడేళ్ల వరకు ఒకే అద్దె ఉంటుంది. నాలుగో సంవత్సరం 10 శాతం పెంచుతారు. చివరి సంవత్సరం నాలుగో ఏడు చెల్లించిన నెలవారి అద్దెపై 15 శాతం అదనంగా వసూలు చేస్తారు. జిల్లాలోని షాపులన్నింటికీ కలిపి నెలకు రూ.23.52లక్షల ఆదాయం వస్తోంది.

ప్రదర్శనకే ధరల పట్టిక

షాపుల్లో అమ్మే వస్తువుల పేర్లు, వాటి ఎంఆర్‌పీ పట్టికను ప్రయాణికులకు కనిపించేలా పెట్టాలి. అందులో చూపిన ధరలను పక్కాగా అమలు పర్చాలి. ఈ విషయం టెండరు ఫారంలోనే ఉంటుంది. కానీ రెండు మూడు షాపుల వద్ద తప్ప ధరల పట్టిక ఎక్కడా కన్పించదు. పట్టిక ప్రదర్శనకు పెట్టిన వాళ్లు సైతం దీనిని అమలు చేయకపోవడం గమనార్హం.

కానరాని చర్యలు

ఎక్కువ ధరకు వస్తువులు అమ్మితే.. మూడంచెల తరహాలో చర్యలు ఉంటాయి. ఆర్టీసీ అధికారులు మొదటి సారి కేసు నమోదు చేస్తే రూ.500, రెండో సారి రూ.1000 జరిమానా విధించాలి. మూడో సా రి కూడా అదే షాపుపై కేసు నమోదైతే షోకాజ్ నోటీసు ఇచ్చి, షాపు టెండరు లైసెన్స్‌ను రద్దు చేయాలి. అయితే, ఇది ఆచరణలో కనిపించడం లేదు.

దోపిడీ ఇలా..

బస్టాండ్లలోని షాపుల్లో నిబంధనల ప్రకారం ఏ వస్తువు కొన్నా దానిపై ముద్రించిన ఎంఆర్‌పీ (మాగ్జిమమ్ రిటైల్ ప్రైస్)కే అమ్మాలి. షాపులను దక్కించుకున్న యజమానులకు ఇచ్చే రాతపూర్వక అగ్రిమెంట్లలో ఈ విషయాన్ని ఆర్టీసీ ప్రస్తావించి ఉంటుంది. కానీ ఈ నిబంధనల ఎక్కడా అమలు కావడం లేదు. రూ.10 ఎంఆర్‌పీ ఉన్న వస్తువును రూ.15కి అమ్ముతున్నారు. మంచినీటి వాటర్ బాటిల్‌తో పాటు తినుబండారాలు, కూల్ డ్రింక్స్ సైతం ఇదే తరహాలో విక్రయిస్తున్నారు. కొన్ని వస్తువులపై అసలు ధర ముద్రించి ఉంటే.. దానిని స్టిక్కర్‌తో కప్పిపుచ్చి సొంతంగా ధర ముద్రిస్తున్నారు. ముఖ్యంగా కర్నూలు కొత్త బస్టాండ్‌లో కుర్‌కురే, లేస్ వంటి ప్యాకెట్లపై ఉన్న ఎంఆర్‌పీ కంటే రూ.5 అధికంగా వసూలు చేస్తున్నారు. దీనిపై దుకాణాదారులను ప్రశ్నిస్తే 'ఇది బస్టాండ్, ఇక్కడ రేట్లు ఎక్కువే ఉంటాయని' సమాధానం ఇస్తున్నట్లు గార్గేయపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే ప్రయాణికుడు పేర్కొన్నారు.

లోపించిన పర్యవేక్షణ

కర్నూలు కొత్త బస్టాండ్‌కు ఎంతో చరిత్ర ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 24 గంటలు పనిచేసే బస్టాండ్‌గా 15 ఏళ్ల కిత్రమే పేరు పొందింది. అయితే, ఇక్కడ పర్యవేక్షణ చేసేందుకు సరైన అధికారి లేరు. వాస్తవానికి ఇక్కడ డిపో మేనేజరు స్థాయి అధికారి గతంలో పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వం స్థాయిని తగ్గించి అసిస్టెంట్ మేనేజరు అధికారిని నియమించింది. ఆ తరువాత కొంత కాలానికి మళ్లీ స్థాయి తగ్గించి కేవలం సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌టీఐ) హోదా ఉన్న ఉద్యోగిని నియమించి సరిపెట్టారు. దీంతో ఏ సమస్య చెప్పుకున్నా.. పరిష్కారం లభిస్తుందనే భరోసా కరువైందని ఆర్టీసీ సిబ్బందే చెబుతున్నారు.

నిద్రిస్తున్న తూనికలు, కొలతల శాఖ

బస్టాండ్లలో ప్రయాణికులు దోపిడీకి గురవుతుంటే తూనికలు, కొలతల శాఖ అధికారులు నిద్ర మత్తులో ఉన్నారు.ఎప్పుడో ఓసారి దాడులు చేయడం.. తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు. కర్నూలు బస్‌స్టేషన్ నుంచి ప్రతి రోజు సుమారు 50 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దుకాణాల్లో వివిధ వస్తువుల కొనుగోలు కూడా భారీగానే ఉంటుంది. అమ్మకం దారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

పలు బస్టాండ్‌లలో నాసిరకం, నాణ్యతలేని తినుబండరాలు విక్రయిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొందరు వ్యాపారులు అధిక లాభం వచ్చే కొన్ని జనరల్ వస్తువులు అమ్ముతున్నారు. తినుబండారాలపై మూతలు పెట్టకుండా అలాగే విక్రయిస్తున్నారు. కొన్ని స్టాళ్లలో కాలం చెల్లిన, దుర్వాసన వస్తున్న వస్తువులు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అధిక ధరలకు విక్రయిస్తున్నారు



బస్ స్టేషన్లలో విక్రయించే వస్తువులు వాటిపై ఉన్న ఎంఆర్‌పీ కంటే రూ.5 నుంచి రూ.10 వరకు ఎక్కువకు అమ్ముతున్నారు.ప్రయాణికులపై యజమానుల దోపిడీని అరికట్టాలి. నాణ్యత పాటించడం లేదు. పరిశుభ్రత ఉండదు. తినుబండరాలు రుచి లేకపోగా వాసన వస్తుంటాయి.

– రాజు, కర్నూలు

వాటర్ బాటిల్‌పై ధరలేదు



లీటరు మంచినీటి బాటిల్ సాధారణంగా రూ.20. అయితే నేను కర్నూలు కొత్త బస్టాండ్‌లో కొన్న బాటిల్‌పై ఎంఆర్‌పీ లేదు. వ్యాపారులు తీసేశారో లేదా నకిలీ బ్రాండ్‌లు అమ్ముతున్నారో అర్థం కాలేదు. నా నుంచి రూ.25 తీసుకున్నారు. రూ.20యే కదా అని అడిగితే బస్టాండ్‌లో ఎక్కడ కొన్నా ఇవే ధరలు ఉంటాయని చెప్పారు.

– సురేష్, వెల్దుర్తి

ఫిర్యాదు చేస్తే చర్యలు



కర్నూలు కొత్తబస్టాండ్‌తో పాటు ఇతర బస్‌స్టేషన్లలో వస్తువులు, తినుబండరాలు ఎంఆర్‌పీకే అమ్మాలి. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు. నిబంధనలు ఉల్లంఘనపై ప్రయాణికులు ఫిర్యాదు చేస్తే దుకాణాదారులపై చర్యలు తీసుకుంటాం. బస్‌స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో తరచూ దుకాణాలు తనిఖీలు చేయిస్తాం.

– టి. వెంకటరామం, జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

● జిల్లా స్పెషల్ ఆఫీసర్ పీఎస్ ప్రద్యుమ్న



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రద్యుమ్న

కర్నూలు కల్చరల్: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్, రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కర్నూలు నగరంలోని వార్డు సచివాలయం 57, బి.క్యాంప్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్, నగర ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. అరోరా నగర్ సచివాలయాన్ని సందర్శించి ఎంత మంది సిబ్బంది ఉన్నారు, ఎవరెవరు ఎలాంటి విధులు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. సచివాలయానికి వచ్చిన స్పందన అర్జీలు పెండింగ్ ఉన్నాయా, ఉంటే ఎన్ని ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు ఏమైనా అర్జీలు వచ్చాయా, వాటిపై ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు అని అడగగా ఎడ్యుకేషన్ సెక్రటరీ ఈ రోజు ఆసరా పథకం కోసం బి.క్యాంప్‌లోని లక్ష్మీబాయ్ అర్జీ సమర్పించారని తెలియజేశారు. తర్వాత స్పెషల్ ఆఫీసర్ బి.క్యాంప్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్‌ని ఆదేశించారు. బి.క్యాంప్‌లో నగర ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. వసతులపై మున్సిపల్ కమిషనర్ భార్గవతేజను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుంకేసుల రోడ్లను ఆర్‌అండ్‌బీ ఎస్‌సీ నాగరాజుతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఉన్నారు.

ప్రయాణికుల మన్ననలు పొందండి

కర్నూలు(రాజ్‌విహార్): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలని రోడ్డు భవనాల శాఖ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న అన్నారు. శుక్రవారం స్థానిక జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో ఆదర్శ ఉద్యోగులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సురక్షిత ప్రయాణాలకు ఆర్టీసీ పెట్టింది పేరని, ఇది డ్రైవర్ల నైపుణ్యత ఫలితమన్నారు. అలాగే ఇంధన భారం తగ్గించేందుకు పొదుపుపై దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం ప్రమాద రహిత డ్రైవర్లు జీఎస్ బాబు, సీవీబీ రెడ్డి, ఎం. ఎల్లప్ప, మియ్య, టీఎస్ గౌడ్, ఆర్‌జే సింగ్, కె. నాగ్రేంద్ర, కేఏ బాషా, డీఎస్ రాయుడు, అధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు టి. రాజేశ్వరి, కె. నరసింహులు, ఎండీ రావు, ఏఎస్ రాజు, జీసీ శేఖర్, ఏవై స్వామి, కేఆర్ కృష్ణయ్య, బి. అయ్యమ్మ, ఎం. గోపాల్, డీజిల్ పొదుపు (కేఎంపీఎల్) చేసిన డ్రైవర్లు బి. నాగేష్, జి.ఎస్ బాబు, బీఆర్ ఆంజనేయులు, ఎఫ్‌బీ అహ్మద్, ఎస్ రహంతుల్ల, పి. అయుబ్ అలీఖాన్, బీఎస్ వాసులు, వి. నటరాజు, కేఎస్ వాసులును ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

పెద్దాసుపత్రికి సిమెంట్ బెంచీల విరాళం





బెంచీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్,జనవిజ్ఞాన వేదిక సభ్యులతో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు జనవిజ్ఞాన వేదిక సిమెంట్ బెంచీలను విరాళంగా అందజేసింది. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ చేతుల మీదుగా వాటిని జనవిజ్ఞానవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక చేస్తున్న ఇలాంటి మంచి పనులు మరెందరికో స్ఫూర్తినిస్తాయన్నారు. దీనివల్ల ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆసుపత్రిలో సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని, ఆసుపత్రిలో మందులు, నిధుల కొరత లేకుండా ప్రభుత్వంతో చర్చిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతిరోజూ 3 వేల మంది రోగులు వస్తారని, రాష్ట్రంలోని పది జిల్లాల ప్రజలకు ఈ ఆసుపత్రి సేవలందిస్తోందన్నారు. ఈ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలుగా తాము కొంత మేరకు విరాళాలను అందజేశామని, ప్రభుత్వ బాధ్యతగా ఎక్కువ నిధులను ఆసుపత్రికి మంజూరు చేసి రోగులకు మెరుగైన వైద్యం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, జనవిజ్ఞానక వేదిక కార్యవర్గసభ్యులు ప్రతాపరెడ్డి, శ్రీరాములు, వీరేష్, దామోదర్, సమతా కన్వీనర్ సుజాత, ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక సభ్యులు రత్నం ఏసేపు, మనోహర్ మాణిక్యం, పాణి, అల్లాబకాష్, సుంకన్న, ఎస్‌డీపీఐ నాయకులు జహంగీర్, అస్పాక్, చాంద్‌బాషా, రామాంజనేయులు, శేఖర్, శివనాగిరెడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నాయకులు రవికుమార్, పుల్లారెడ్డి, మదేశు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజు

నగరపాలక సర్వసభ్య సమావేశం



నగరపాలక కార్యాలయం

కర్నూలు (టౌన్) : కర్నూలు నగరపాలక 15వ సర్వసభ్య సమావేశం శనివారం జరుగనుంది. స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి నగర మేయర్ బీవై.రామయ్య, కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరుకానున్నారు. సమావేశంలో మొత్తం 50 అంశాలపై పాలకవర్గం చర్చించి పాలక పక్ష సభ్యుల ఆమోదం తీసుకునుంది. ఏజెండా అంశాల్లో ప్రతి వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పన, క్రిష్ణనగర్‌లో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి, నగరంలోని కిడ్స్ వరల్డ్ నుంచి బళ్లారి చౌరస్తా వరకు 120 అడుగుల రోడ్డుగా విస్తరణ, బిర్లాగడ్డ మౌలీ దర్గా నుంచి గాయత్రీ ఎస్టేట్ వరకు డ్రైన్ కల్పన తదితర వాటిపై చర్చించనున్నారు.

మున్సిపల్ మంత్రి రాక

కర్నూలు (టౌన్) : రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం కర్నూలుకు రానున్నారు. హైదరబాద్ నుంచి సాయంత్రం 4 గంటలకు బయలుదేరి కర్నూలుకు 7 గంటలకు చేరుకుంటారు. కర్నూలు మండలం మిలటరీ కాలనీలో ఉన్న ప్రేమగిరిలో నిర్వహించనున్న శినాయ్ డివైన్ ధ్యానాశ్రమం సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మంత్రి పాల్గొంటారు. అనంతరం 9 గంటలకు హైదరబాద్‌కు బయలుదేరి వెళతారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని మున్సిఫ్ కోర్టు వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఎల్‌బీఎస్ నగర్, మున్సిఫ్ కోర్టు ఏరియా, ఖండేరి, సెంట్రల్ లైబ్రరీ, కురువ వీధి, చిదంబరరావు వీధి, కింగ్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆ స్థలాలను ఖాళీ చేయించాలి

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని కోట ఆంజనేయ స్వామి ఆలయం స్థలాన్ని ఆక్రమించుకుని నివస్తున్న కుటుంబాలను ఖాళీ చేయించాలని బజరంగ్‌దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జేపీ రాష్ట్ర నాయకులు కగ్గోలు హరీష్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం సఫాయి కర్మచారి కార్యాలయంలో ధార్మిక సంస్థల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్వహణ కోసం దాతలు ఇచ్చిన స్థలాన్ని కొన్ని కుటుంబాల ఆక్రమించుకుని అనుభవిస్తున్నారన్నారు. ఆలయ పునర్నాణం కోసం ఖాళీ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా ఖాళీ చేయడం లేదన్నారు. సమావేశంలో సంఘాల నాయకులు భాను ప్రకాష్, ప్రతాప్‌రెడ్డి, శ్యామసుందర శర్మ, బాబూజీ, శివరామ్, ప్రవీణ్, గణేష్, చంద్రశేఖర శర్మ, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కర్నూలు (రూరల్): జగన్నాథ గట్టుపై నిర్మించిన టిడ్కో, ఇందిరమ్మ గృహా సముదాయల్లో మౌలిక వసతులు కల్పించాలని టిడ్కో, ఇందిరమ్మ గృహా లబ్ధిదారుల సాధన సమితి కన్వీనర్ జగన్నాథం హౌసింగ్ పీడీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ రెడ్డి, మహేష్, బీసన్న, ఈశ్వర్, కిట్టు పాల్గొన్నారు

పాఠశాలలను సీజ్ చేయాలి

కల్లూరు: మండలంలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం పందిపాడులోని జీఎస్ఎన్ఆర్ పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్, స్టాలిన్, ఇబ్రహీం, గిరి, రియాజ్, అస్లాం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నగర అధ్యక్షుడిగా సూర్యకుమార్

కర్నూలు కల్చరల్: దళిత హిందూ ధర్మ ప్రచార పరిషత్ కర్నూలు నగర అధ్యక్షుడిగా సూర్యకుమార్ నియమితులయ్యారు. పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బాబూజి ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నూతన నగర అధ్యక్షుడు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలి



ఉల్లి సోలార్ డ్రయర్ల మిషన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రభుత్వ పథకాల ద్వారా జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం తడకనపల్లె గ్రామంలో ఏపీ ఎమ్ఐపీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 23 యూనిట్ల ఉల్లి సోలార్ డ్రయర్లను ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతులు, కుమార్తె కాటసాని మాధవి లతరెడ్డి, ఏపీ ఎమ్ఐపీ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ బోయ శారద ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఉల్లి సోలార్ డ్రయర్ల యంత్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఉల్లిపాయాల పొడి తయారీకి మ్యాపింగ్ చేసి అన్ని గ్రామాల్లో ఉత్పత్తి చేసేలా యూనిట్లను ప్రారంభించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తడకనపల్లెలో ఉల్లిపాయాల పొడి తయారీ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం గ్రామంలోని 25 ఉల్లి సోలార్ యూనిట్ల ఉపయోగం గురించి ఎమ్మెల్యే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు నాలుగు బ్యాగుల ఉల్లి గడ్డలను మిషన్‌లో కట్ చేస్తున్నామని, నెలకు సుమారుగా రూ. 15వేల నుంచి రూ. 18 ఆదాయం వస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి, ఏఓ శ్రీనివాసరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రమణారెడ్డి, కల్లూరు సొసైటీ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌డబ్ల్యూఓల బదిలీల్లో అన్యాయం

కర్నూలు(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో నివసతి గృహ సంక్షేమాధికారుల బదిలీల్లో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని నగరంలోని ఎస్‌డబ్ల్యూ కళాశాల బాలికల వసతి గృహం నెం:1 హెచ్‌డబ్ల్యూఓ డి. కరుణలత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం జిల్లా కలెక్టర్ డా.జి సృజనను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... ప్రభుత్వ నిబంధనల మేరకు ఖాళీగా ఏర్పడనున్న కోడుమూరు బాలికల వసతి గృహానికి తనను బదిలీ చేయాలని మొదటి ఆప్షన్‌గా దరఖాస్తు చేసుకున్నానన్నారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న హెచ్‌డబ్ల్యూఓను కర్నూలుకు బదిలీ చేసి ఆ వసతి గృహాన్ని బీసీ సంక్షేమ శాఖకు చెందిన హెచ్‌డబ్ల్యూఓకు ఇన్‌చార్జ్ ఇచ్చారన్నారు. తన అభ్యర్థనను పరిశీలించకుండా డీడీ పరిపాలనా సౌలభ్యం పేరుతో తనను నంద్యాల జిల్లా డోన్‌కు బదిలీ చేశారన్నారు. ప్యాపిలిలో పనిచేస్తున్న ఓ హెచ్‌డబ్ల్యూఓను ఆదోనికి బదిలీ చేసేందుకు తనను అన్యాయంగా డోన్‌కు బదిలీ చేశారని వాపోయారు. వృద్ధురాలైన తల్లి, అత్త బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని, క్లియర్ వేకేన్సీగా ఉన్న కోడుమూరుకు తనను బదిలీ చేయాలని ఆమె కోరారు.

బాధిత కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నక్కా వెంకటరత్నం

కర్నూలు(అగ్రికల్చర్): అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మరణించినప్పుడు వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇటీవల కాలంలో వివిధ కారణాలతో పలువురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మరణించిన నేపథ్యంలో ఆయన మార్కెట్‌కు వచ్చారు.అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న యార్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సాధారణంగా మరణిస్తే రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10 లక్షలు ఇవ్వాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సీనియారిటీని పరిగణలోకి తీసుకుని రెగ్యులర్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో మరణించిన యార్డు అసిస్టెంట్ల కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు తెలుగు నాగరాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

5న హుండీ కానుకల లెక్కింపు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె. నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి దేవాలయంలో ఈ నెల 5వ తేదీన హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు శుక్రవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి దినేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి నాలుగు నెలలకోసారి హుండీ లెక్కింపు చేపడుతున్నామన్నారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను గ్రామ పెద్దలు, పోలీసులు, బ్యాంకు అధికారుల సమక్షంలో లెక్కింపు చేపడుతామన్నారు.

నగర పాలక ఇంజినీర్ల బదిలీలు

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ ఇంజినీర్ విభాగంలో ముగ్గురు ఇంజినీర్లు బదిలీ అయ్యారు. శుక్రవారం రాత్రి ముగ్గురిని బదిలీ చేస్తూ ఇంజినీరింగ్ విభాగం చీఫ్ ఇంజినీర్ పి.ఆనందరావు ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేసే రాధాకృష్ణా నంద్యాల మున్సిపాలిటీకి అలాగే ఏఈగా పని చేసే డీవీ కృష్ణలత నందికొట్కూరు మున్సిపాలిటీకి, ఏఈ హిమబిందు నంద్యాల మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

విన్నపం

కొట్టంబడి స్థలాన్ని కాపాడాలి

కర్నూలు (రూరల్):ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్ (కొట్టంబడి) స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీల నేతలు కోరారు. శుక్రవారం నగరంలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో కొట్టంబడి స్థలాన్ని కాపాడాలని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ వార్డు కార్పొరేటర్ మునెమ్మ కొట్టంబడి స్థలానికి ఇచ్చిన పట్టాను వెంటనే రద్దు చేసి ఆ స్థలంలో గ్రంథాలయం లేదా కమ్యూనిటీ హాల్ లేదా సచివాలయం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో రోశయ్య, మద్దిలేటి, లోకేష్, అన్నయ్య, విక్రం, రాజు పాల్గొన్నారు.

